# 10

# ఇందిర ఎన్టీఆర్

**'బాతాల పోశెట్టి' పేరిట రాసిన కాలమ్స్**

"తిన్నావే ఎల్లన్నా?"

"నసరాదుర"

"ఏంటిదె...? సీకట్ల ఏమో పునుకుతున్నవు?"

"మట్టి దీపం కోసంరా!"

"ఎందుకే దేవునికిగిట్ట పూజజేత్తవా?"

"గాంచునూనె నా(లుపాలైంది. అదిగుడ దొరకలే."

"మార్చిల పూటపూటకు ధరలు గట్లనే పెరుగుతున్నయి తియ్యి"

"గట్లెందుకు పెరుగాలె?"

"పాత స్టాక్ అంతా బ్లాకుచేసి అమ్ముకుని బతుకుమని"

"నడిమి లంజెకొడుకులు గట్ల జేసిరి గని అసలు గట్లెందుకు పెరుగాలె?"

"సర్కారే పెంచింది. సర్కారుకు పైసలు తక్కొవడుతున్నయట. భర్తి చేసుకునుటానికట"

"ఇంతగనం సర్కారు ఏంజేసి పెడుతున్నదిర?"

"అగో, గట్లంటవేమే. పోచంపాడు కాల్వలు రాలేదా..."

"నాకు గుంటెడు భూమన్నలేదు."

"కరెంటు రాలేదా?"

"కరెంటు పెట్టుకునే తాకతు గావద్దా?"

"టెలిఫోనొచ్చె".

"ఏంజేసుకోవాలె?"

"డాంబర్ రోడ్ పడె. సరసర పోవచ్చు."

"ఔ ఇగ జీబు గొనాలెర!"

"ఎక్కిరియ్యవడ్తి వేందే? పదేండ్లకింద ఎట్లుండె? యిపుడెట్లున్నది మనూరు?"

"ఔర నిజమేరో... ఐదారేండ్ల కింద ఏదన్నా కొట్లాటైతే పోలీసోడు సైకిలేసుకుని ఎగపోసుకుంట వచ్చెటాల్లకు ఊరుగాలేది. పీరిలేసేది. యిపుడేమో "దొర నన్ను సంపుతున్నరు" అని గిట్ల టెలిఫోన్‌జేత్తె గట్ల ఉరికచ్చి ఊరోల్ల ఈపంత సాపుచేసుటానికి అయిదు నిమిషాలు పడుతలేదు"

"మనం గెలిపిచ్చిన సర్కారుగాదె. యివన్ని జేసేది"

"గందుకె ఈసారి ఎన్టిగాన్కి ఓటేత్తె ఉన్నదివాయె. ఉంచుకున్నదివాయె. గాంచునూనె గతిలేకుండ జేసెగదర"

"గ్యాసునూనె ధర ఎన్టీరాంరావు చేతులలేదె. యిందిరమ్మ పెంచిందె."

"దీనింట్ల పీనుగెల్లా"

"ఏమైందే...?"

"గూట్లె చెయివెట్టె ఎల్క లటుక్కున కొరికేనేంర?"

"ఓ సిమెంటు బస్తదెచ్చి ఎల్క పొల్కలన్ని మూపెయ్యిమంటిగదనె"

"పొద్దుగాల అడుగుతె బత్తకు డెబ్బయి అన్నడు. వీడచ్చి దాని ధరగూడ పెంచిండు."

"అదిగూడ ఎన్టిరాంరావు చేతులలేదు. దానిధరగూడ యిందిరగాంధే పెంచింది."

"యిది దొరికి సత్తలేదు. అది అగ్గిపెట్టెకని అటేవాయె. అగ్గిపుల్ల గీకుర, అవునుగాని పట్నంకు తారుగొట్టినవ? సావుకు అందకపాయె, దినాలకన్న అందుతడేమో?"

"వానియవ్వ టెలిగ్రాం చార్జి కూడ దబలయ్యింది. మనిషిని తోలేసినంత కరుసైంది."

"అదిగూడ ఇందిరగాంధే పెంచిందను"

"నిజంగనేనే. అవ్వతోడు. యిందిరగాంధే పెంచింది".

"అన్నిటికి ఇంద్రగాంధే పేరుపెడుతవ్ మొన్ననే యిందిరగాంధి ఓడిపోయి ఎన్టిగాడు గెల్సిండంటివి గదరా?"

"నిద్రమబ్బులోడు జెప్పిండు యింద్రగాంధీ ఓడిపోయిందని. యింద్రగాంధీ పార్టీ ఓడిపోయింది ఇక్కడగని, దేశం మొత్తాన పెబ్బతీర్గ యింద్రగాంధీ యింక అట్లెనే ఉన్నదింక"

"ఓర్నియవ్వ! గిదేందిర కొత్త సిట్టం!"

"కొత్తదేంకాదు, పాతసిట్టమే యిది"

"అగో యింద్రగాంధీ ఉందనవడ్తివి ఎన్టిగాడు వున్నడనవడ్తివి"

"అదిగంతేగని. యింక ముంగట జూడు తమాషా"

"ఏందిర?"

"ఉప్పుగ్గూడ ధర పెరుగుతది"

"పొయ్యేకాలమచ్చింది. పోకటపోతె దత్తూరు కుదరద్దా. వేషాలేసుకుని బతికెటోనికి రాజ్యాలేలత్తాది. నాకు లోపల నవనవ అంటేనే ఉన్నది గని."

"యిదిగూడా ఎన్టిరాంరావు పెంచింది గాదె. రైలు కిరాయిలు పెరిగినయి. డీజలు ధర పెరిగింది. గందుకే ఉప్పు ధర పెరుగుతది. యిదిగూడ యింద్రగాంధే జేసిందే!"

"హత్తెరి! కిందికుండ కిందుండగ మీదికుండ మీదుండగ నడిమికుండ తప్పదీసినట్టు, అన్ని యింద్రగాంధి జేసినంక యిగ ఎన్టిగాడేం జేసిపెడతర్ర మనకు?"

"మనకు కల్లమ్ముతడే కల్లు. మనకు తాగుమని నల్లగల్లు, తెల్లగల్లు, బీరు, బరండీ"

"నీ జుట్టు తియి"

"అంటె నేను అవద్దం జెపుతున్నంటవ? నీ యవ్వ! నీ తెలుగుదేశం పార్టీ, ఎన్టిరాంరావు గిట్ల కల్లమ్ముడు బందువెడ్తె నేను చెవిగోసిత్త. గీ కల్లు మీన్నె యాట మొత్తం ఏడునూర్ల కోట్ల రూపాయల లాభం వత్తందని మొన్న జెప్పలేదా మినిష్టరు"

"అంటే మనం కల్లుదాగుతేనె సర్కారు నడుత్తదంటవు"

"ఔ మరి. ఒక్క యాడాది కల్లుదాగుడు అందరు బందువెట్టిసూడని. ఒక్క యాడాదెందుకే. ఒక్క నెల బందువెట్టి సూడరాదు. సర్కారంత కిందిమీద గాకపోతె నన్ను పేరువెట్టి పిలవకు".

"ఓర్నియక్క మొన్నటి ఎలచ్చన్లంత గిందుకేనా? అంత కలాల్ దలాల్ మాంలా అంటవ్."

"మరి. లేకపోతె ఎన్టిరాంరావు ప్రభుత్వం ఏందో జేత్తదనుకున్నవ. పోరగాన్లకు రోజోపూట బుక్కెడు, బుక్కెడంటే బుక్కెడేనే. రెండు చటాకుల తిండి పెట్టడానికి తల్కాయ కిందికివెట్టి కాల్లు మీదికి జేత్తాంది"

"మా యెల్లమే ఏమైందిరో? ఎక్కి రెన్నెల్లు గాకపాయె ఎమ్మెల్లేలకు పించను రద్దుచేసిండు. ఎవనికేంజేసిన్రు. పందికొక్కులతీర్గ ఎవని బొత్త కిందికి ఆడు తోడుక తిన్నరు."

"ఎనుకట దొరలు మనిషికో గడీ గట్టుకొన్నట్టు యింద్రగాంధీ పార్టోల్లు మనిషికో గడీ తీర్గ దోసుకునుటాన్కి కార్పొరేషన్లని పెట్టిన్రు. అక్కరకురానివన్ని ఊడవీకి ఒక్కటి జేసిండు ఎన్టిరాంరావు."

"మంచిపని జేసిండు"

"సర్కారు నౌకరు మీదున్నోల్లను యింతకుముందు 58 ఏండ్లకు పించిని అయ్యేది. యిపుడు 55 ఏండ్లకే పించిన్ జేసిండు. కొత్తోల్లకు నౌకర్లు దొరుకుతయన్నడు. లంచాలు తీసుకునేటోల్ల నౌకరు ఊడపీకేత్తన్నడు. కలెక్టరంత పెద్ద పెద్ద నౌకరిగాల్లను ముగ్గురి నల్గురిని సస్పెండు జేసిండు."

"మంచిపని జేసిండు".

"సర్కారి నౌకరిగాల్లంత గజగజ వనుకుతాన్రు. నౌకరి ఎక్కడ పీకుతదో అని."

"మంచిగైంది వేలకాన జీతాలు దొబ్బుతుండ్రు... గట్లసెప్పినట్లు యినాలె."

"నిన్నడున్న సర్కారోడు గట్ల సెప్పినట్టు యింటనే యియ్యాల్లగిట్ల సస్పెండు చేసిన్రే.."

"గట్లెట్లర?"

"నిన్నటిదాక యింద్రగాంధి పార్టోల్లు ఉండి లంగతనం జెయ్యమంటె జేసిన్రు. వచ్చిన లాభం పంచుకతిన్నరు. యియ్యాల్ల ఒక్క నౌకరిగాల్లనే అంటే ఏమత్తదే"

"అల్లనుగూడ గట్లనే జెయ్యాలె."

"అది ఎన్టిరాంరావు అబ్బతరంగూడ గాదు. ఆల్లను ఏమన్నజేత్తె మీదికెల్లి

యింద్రగాంధిలేదా? ఒక్క కాయితం మీది గీత తోటి ఎన్టిరాంరావు ప్రభుత్వం బోయి యింద్రగాంధి చేతులుండే రాష్ట్రపతిపాలన వస్తది"

"ఐతే ఎన్టిరాంరావుదంత యింటోన్ని తన్నంది ఇది మీసంగాదన్న యెవారమేనా?"

"లేకపోతేంది? గా గాంచునూనె రెండ్రూపాలకు లీటరమ్మేది నాల్రూపాలైంది. అట్ల అమ్మినోల్లను ఎంత మందిని జేల్లేపిచ్చిండు?'

"ఔ నిజమేరో! నాల్రూపాలకు నడిబజాట్ల అమ్ముతే ఎవన్ని జేల్ల ఎయ్యక పాయిరేంర?'

"ఔగని పల్లినూనె వోసి దీపంముట్టియ్యవేమ్మే?'

ఎందుకుతియ్యి. సీకట్లుంటే ఎల్లదాయె... అదుంటే రేపు యింత కూరలకన్న అక్కరకత్తది. పదిహేన్రూపాలకు కిలో ఉన్నది."

"బీట్ల పల్లికాయ రెండ్రూపాలె ఉందిగాదె."

"ఔనెంర. రెండ్రూపాలెక్కడ, పదిహేన్రూపాలెక్కడ?"

"వద్లుగూడ బీట్లె అగ్గొనే ఉన్నయి. మనం కొని పట్టించుకొంటె రెండు రూపాలకు కిలో గిడుతయి"

"అయితే రెండు పల్లాలు కొన్రాదురా?"

"నువ్వు నేను కొనరాదు. లైసెన్సు కావాలె. లైసెన్సున్న షావుకారి కొనాలె. కొని దాసుకోవాలె. దాసుకొని పట్టిచ్చి కిలోకు మూడ్రూపాలకు అమ్మాలె. గప్పుడు రసీదుమీద మనం బియ్యం గొనాలె."

"యీ పద్ధతి ఊడవీకేసి సర్కారేగొని పట్టిచ్చి మనకు అమ్ముతె అగ్గొకురావా?"

"మా అత్తయిగని, సావుకార్లు ఎట్ల లాభపడ్తరే?"

**'చాటింపు' పక్ష పత్రిక 1983**